క్లుప్తంగా

అక్టోబరు 3 నుంచి బ్రహ్మోత్సవాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర ఆలయంలో అక్టోబరు 3 నుంచి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. అక్టోబరు 3న పల్లకి సేవ, 4న కల్పవృక్ష వాహనం, 5న హంస వాహనం, 6న శేష వాహనం, 7న అశ్వ వాహనం, 8న హనుమంత వాహనం, 9న గజ వాహనం, 10న సింహ వాహనం, 11న గరుడ వాహనం, 12న విజయ దశమి, రథోత్సవం, వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు సత్యనారాయణ శర్మ తెలిపారు.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలి



కుక్కకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: పెంపుడు కుక్కలకు విధిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. శనివారం పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. పిచ్చికుక్క కాటు ప్రమాదకరమని, సాధ్యమైనంత త్వరగా చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కుక్కకాటు గాయాన్ని నీటితో శుభ్రంగా కడిగి ప్రాథమిక చికిత్స చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కోట కేశవ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాల తరగతి గదిలో శనివారం పాము కనిపించింది. ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు పామును గుర్తించి బయటకు పరుగులు తీశారు. స్థానికులు పిలిపించి పామును కట్టెతో కొట్టి చంపించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాటు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండల కేంద్రంలోని దసలి పట్టుపరిశ్రమ ఎదుట శనివారం సాయంత్రం కౌటాల ఎస్సై మధుకర్ వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేట్టారు. వాహనదారులు అన్నిపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ఇంద్రవెల్లి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కళాజాత బృందం ద్వారా హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్(హెచ్ఐవీ) వ్యాధి ఎలా వస్తుంది, ని వారణ చర్యలపై పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సీహెచ్ దామోదర్, శంకర్, విలాస్, రవి, నవ్య పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి: మండలంలోని మిలింద్‌నగర్‌లో దమ్మ చక్ర యూత్ కార్యవర్గాన్ని శనివారం బుద్ధ విహార్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్రీరత్న బుద్ధ విహార్ బంతేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో దమ్మ చక్ర యూత్ మండల అధ్యక్షుడిగా నవీన్ వాగ్మారే, ఉపాధ్యక్షుడిగా మస్కే అన్విత్, ప్రధాన కార్యదర్శిగా రుథిక్ కాంబ్లే, కార్యదర్శిగా అరవింద్ గోప్నే, కోశాధికారిగా శక్తి వాగ్మారేలను ఎన్నుకున్నారు.

నీటి సరఫరాపై శిక్షణ

ఇంద్రవెల్లి: గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ కార్మికులకు నీటి సరఫరాపై మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మాస్టర్ ట్రైనర్ బషీర్ ఆధ్వర్యంలో ఈనెల 27న బోరుబావులు, బావుల్లోని విద్యుత్ మోటర్ వాడకంపై అవగాహన కల్పించగా.. శనివారం చేతి పంపుల మరమ్మతుల గురించి వివరించారు. 30న నీటి పరీక్షలు, అక్టోబర్ 1న ప్లంబింగ్, పైప్‌లైన్ మరమ్మతులపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మిషన్ భగీరథ ఈఈ గోపిచంద్ తెలిపారు. నీటి సరఫరా విషయంలో సమస్యలు రాకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రారంభానికి నోచుకోని వైకుంఠ ధామాలు
- పట్టించుకోని అధికారులు



సెగ్రిగేషన్ షెడ్డు (మోతుగూడ)



నిరుపయోగంగా ఇదులవాడ వైకుంఠధామం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోట్ల రూపాయలతో నిర్మించిన సెగ్రిగేషన్, వైకుంఠ ధామాలు, డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారాయి. ప్రతీ గ్రామపంచాయతీకి ఈజీఎస్ పనుల్లో భాగంగా వైకుంఠధామాలు నిర్మించారు. కానీ నేటి వరకు వాటిని వినియోగించకపోవడంతో పిచ్చిమొక్కలు మొలకెత్తి, గోడలు కూలీపోయే స్థితికి చేరాయి.

జిల్లాలో 315 జీపీలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 315 గ్రామ పంచాయతీల్లో పల్లెలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు చెత్త నుంచి సంపద తయారీకి ప్రభుత్వం నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తడి పోడి చెత్తను వేరు వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం చేర్చేలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డులు అధ్వానంగా మారాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో రేకులు గాలికి ఎగిరిపోయాయి. సెగ్రిగేషన్ షెడ్లకు రూ. 2.50 లక్షలు, వైకుంఠధామాలకు రూ. 12.60 లక్షలతో నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా.. నేటి కూడా వాడకంలోకి రాలేదు.

వినియోగం లేక..

ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. నేటి వరకు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఊరి దూరం ఉండటంతో వెళ్లేందుకు దారి లేక, వర్షాకాలం అటు వైపు చేసే వారు లేరు. దానితో పాటు వైకుంఠధామాలు నిర్మించినప్పటికీ నీరు, కరెంట్ సౌకర్యం మాత్రం కల్పించ లేదు. దీంతో వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. నాసిరకం పనులతో ఇప్పటికే గోడలు బీటలు వారి కూలీపోయే స్థితికి చేరుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం

కొన్ని గ్రామాల్లో ఊరికి దూరంగా సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. వర్షా కాలం పోయే పరిస్థితి రోడ్డు సౌకర్యాలు లేవు. దీంతో కొన్ని నిరుపయోగంగా మారాయి. వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజ్ అలీ

వాంకిడి: ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓట రు జాబితలో పేర్లు లేకపోయినా, వేరే ప్రాంతంలో నమోదు అయినా.. ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా సహరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ శ్రావణ్ కుమార్, ఆర్ఐ మాజిత్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను ప్రచురించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాను వార్డుల వారీగా నోటీసు బోర్డుపై ఉంచామని తెలిపారు.

కౌటాల: మండల ఓటర్ జాబితాను శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కోట ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితాను సవరించి విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 182 వార్డుల పరిధిలో 26,896 ఓట్లు ఉన్నాయని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీవో మహేందర్‌రెడ్డి, దీపక్, కార్యదర్శులు సాయికృష్ణ, సునీత, ఆపరేటర్లు సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

ఓటరు తుదిజాబితా విడుదల

దహెగాం: వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణ చేశామని తుది జాబితాను శనివారం విడుదల చేసినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఓటరు ముసాయిదా జాబితా నోటీసు బోర్డులపై అంటించడం జరిగిందన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

వాంకిడి: మహిళలు, విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. శనివారం షీటీం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చట్టాలు, వ్యక్తిగత భద్రతలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు పాల్పడితే షీటీం దృష్టికి తీసుకురావాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తే వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, షీటీం సభ్యురాలు శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

సిర్పూర్(టి): ఆర్టీసి బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించ వచ్చని ఆర్టీసి ఆసిఫాబాద్ డిపో ఏడీసీ సేఫ్టీ వార్డెన్ రేగుంట పోచం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణాలు చేయవద్దని, ఆర్టీసి బస్సుల ద్వారా ప్రయాణాలే సురక్షితమని అన్నారు. ప్రతీ పల్లెకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందన్నారు. హెల్మెట్లు ధరించి నిర్ణీత స్పీడ్‌లతోనే ప్రయాణాలు సాగించాలని, ఇండికేటర్లు, సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

వాంకిడి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు గేడం టికానంద్ అన్నారు. శనివారం మండలంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్‌ను జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షురాలు చాపిడి శ్రావణి, తిరుపతి, శ్రావణి, అశ్లేష పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: నేటి యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాజ్‌కుమార్, ప్రసాద్‌గౌడ్, సత్తన్న, శ్రీకాంత్, పోసన్న, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

సికిల్‌సెల్ నిర్మూలనకు సహకరించాలి

వాంకిడి: సికిల్‌సెల్ నివారణకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని మండల వైద్యాధికారి వినయ్ ఉప్రే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేషనల్ సికిల్‌సెల్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జన్యూపరంగా వచ్చే వ్యాధిని నివారించాలంటే దీనిని ప్రారంభ దశలోనే గుర్తించాలన్నారు. దీర్ఘకాలిక రక్తహీనత, ఎముకలలో తీవ్రమైన నొప్పి వంటి లక్షణాలతో ఎవరైన ఉంటే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్సకు అనుకూలంగా ఉంటుందని, అలాగే భవిష్యత్ తరాలకు వ్యాపించకుండా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజిజుద్దిన్, ఎంఈవో శివచరణ్ కుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్, హెచ్ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్ ఉప్రే

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

కౌటాల: కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్‌వో పవిత్ర తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల నిర్వహించిన జిల్లాస్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. 'చెట్టు చెట్టమను నేను' అనే పాటకు విద్యార్థినులు చేసిన నృత్యం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శైలేజా, అక్షయ, సురేఖ, శిరీష, పూర్ణమి, ఆలేఖ్య, గంగా పాల్గొంటారన్నారు. విద్యార్థినులను ఎంఈవో గావుడే హన్మంతు, ఉపాధ్యాయులు అభినందించారు.

చెక్కు అందజేత

కౌటాల: హైదరాబాద్‌లోని నిజాం హాస్పిటల్‌లో శనివారం కౌటాల మండల కేంద్రానికి చెందిన అజ్మత్ అలీకి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అందజేశారు. కౌటాల మండల కేంద్రానికి సయ్యద్ అహ్మద్ అలీ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం రూ. 1లక్ష సహాయం అందించిందని తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

జోనల్ పోటీలకు 52 మంది ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్, డీఎస్‌వో మీనా రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికలకు హ్యాండ్ బాల్, చెస్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 52 మంది జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగు, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ఏసీఎంవో ఉద్ధవ్, పీడీ, పీఈటీలు శారద, రజిత, కల్పన, రమేశ్, ప్రవీణ్, కోచ్ రవీందర్ పాల్గొన్నారు.



ఎంపికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొలిప్యాక శంకర్ అన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడి ఆదేశాల మేరకు క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్ల విత్తనాలతో శిశుమందిర్ విద్యార్థులచే 1200 సీడ్ బాల్స్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఒక కోటి సీడ్‌బాల్స్ తయారు చేసి దేశవ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో వేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల జంతువులకు ఆహారం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎకిరాల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, గుండ ప్రమోద్, వాసవీ మందిర్ అధ్యక్షుడు రావుల శంకర్, శిశుమందిర్ కార్యదర్శి కొలిప్యాక వేణుగోపాల్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు సాగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఈ భాషా

రెబ్బెన: క్రీడ పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో సాగాలని బెల్లంపల్లి ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈ భాషా అన్నారు. డబ్ల్యూపీఎస్, జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా శనివారం గోలేటిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు శరీరక బలంతో పాటు బుద్ధి బలం ఉపయోగించినప్పుడే విజయం సాధించవచ్చన్నారు. ప్రతి క్రీడాకారుడు తోటి క్రీడాకారుడితో మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు జగ్గయ్య, జూపాక రాజేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో అడవులకు కొదువ లేదు. ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు, అనుకూల వాతావరణంతో అడవుల విస్తీర్ణం పెరుగుతోంది. రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్లు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. కాగజ్‌నగర్ నుంచి ఆయా మండలాలకు వెళ్లే రహదారులు, పచ్చదనంతో కమ్ముకున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లు రహదారులకు పచ్చని తోరణాలుగా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - చింతలమానెపల్లి